క్లుప్తంగా

ఓటర్లకు హనిమిరెడ్డి ధన్యవాదాలు

అద్దంకి: ఎన్నికల వరకు అహర్నిషలు పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు, ఓటర్లకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల అంకం ముగిసినందున, లెక్కింపు పర్వం జరగాల్సి ఉందని తెలిపారు. లెక్కింపులో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు

చీరాల: సార్వత్రిక ఎన్నికలలో చీరాల నియోజకవర్గ ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని తనకు అండగా నిలిచిన ఓటర్లకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఓటర్లు అందరూ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఎన్నికల నిర్వహణలో తన వెంటే ఉన్న నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాయకులకు పరామర్శ



గాయపడిన నాయకులను పరామర్శిస్తున్న మహేశ్‌రెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ ఏజెంట్లను ఆ పార్టీ మండల నాయకుడు కైపు మహేశ్‌రెడ్డి పరామర్శించారు. వారు నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి ఎలా ఉందో తెలుసుకున్నారు. టీడీపీ సానుభూతిపరులు, నాయకులు గూండాల్లాగా మారారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించాలన్నారు. రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. లెక్కింపులో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించనుందని చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

గంగమ్మతల్లికి పూలాభిషేకం



కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లి 37వ తిరునాళ్లు ఈనెల 5వ తేదీతో ముగిశాయి. దీంతో వారి ఆచారం ప్రకారం తిరునాళ్ల మరుసటి రోజున ఆలయం తలుపులు మూసివేశారు. తొమ్మిదో రోజు మంగళవారం ఉదయం అమ్మవారి గుడి తలుపులను తీసి అమ్మవారికి తలంట్లు పోసి, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి, పూలాభిషేకం చేశారు. అనంతరం సుమారు 5వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

పర్చూరు నియోజకవర్గంలో 80.05 శాతం పోలింగ్



యద్దనపూడిలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చొని ఉన్న ఓటర్లు (ఫైల్)

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలో 80.05 శాతం మంది ఓటర్లు సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పర్చూరు రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ మంగళవారం తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు పర్చూరు, చినగంజాం, కారంచేడు, మార్టూరు, ఇంకొల్లు, యద్దనపూడిలలో మొత్తం 2,29,333 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,11,865 మంది కాగా మహిళలు 1,17,462 మంది, ట్రాన్స్ జెండర్లు అరుగురు ఉన్నట్లు తెలిపారు. మే 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 2,00,264 మంది తమ ఓటు హక్కును వినియోగంచుకోగావారిలో 98,025 మంది పురుషులు, 1,02,238 మంది మహిళా ఓటర్లు, 1 ట్రాన్స్‌జెండర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన వివరించారు. ఓటు హక్కు వినియోగంలో మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే 4213 మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు న్నారు. ముఖ్యంగా కొత్తగా ఓటరు నమోదైన యువతీ, యువకులు అత్యంత ఉత్సాహంగా ఓటును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌లకు వచ్చారని ఆయన తెలిపారు.

మండలాల వారీగా పోలైన ఓట్లు చూసుకుంటే..

- మార్టూరు మండలం మొత్తం ఓట్లు 58,662 పురుషులు 28,878 మంది, మహిళలు 29,781 ఉన్నారు. ఇందులో 51,043 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 25213 , మహిళలు 25830 ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- యద్దనపూడి మండలంలో మొత్తం ఓట్లు 21,525 ఉన్నాయి. ఇందులో 10,173 పురుషులు, 11351 మహిళలు ఉన్నారు. 19596 ఓట్లు పోలయ్యాయి. 9296 పురుషులు, 10300 మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- పర్చూరు మండలంలో మొత్తం ఓట్లు 42684 ఉన్నాయి. ఇందులో 37838 ఓట్లు పోలయ్యాయి. 20692 పురుషులు, 21992 మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కారంచేడు మండలంలో మొత్తం 32518 ఓట్లు ఉన్నాయి. పురుషులు 15758, 16760 మహిళలు ఉన్నారు. ఇందులో 27849 ఓట్లు పోలయ్యాయి. 13642 పురుషులు, 14207 మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఇంకొల్లు మండలంలో మొత్తం 43,481 ఓటర్లు ఉన్నారు. వారిలో 21,190 పురుషులు, 22,290 మహిళలు ఉన్నారు. ఇందులో 37523 ఓట్లు పోలయ్యాయి. 18417 పురుషులు, 19105 మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- చినగంజాం మండలంలో మొత్తం 30463 ఓటర్లు ఉండగా, 15174 పురుషులు, 15288 మహిళలు ఉన్నారు. ఇందులో 26415 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 13125, మహిళలు 13290 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా పోలైన ఓట్లు

	మొత్తం ఓట్లు	వినియోగించుకున్నవి	పురుషులు	మహిళలు
మార్టూరు	58,662	51,043	25213	25830
యద్దనపూడి	21,525	19596	9296	10300
పర్చూరు	42684	37838	18,332	19506
కారంచేడు	32518	27849	13642	14207
ఇంకొల్లు	43,481	37523	18417	19105
చినగంజాం	30463	26415	13125	13290

సార్వత్రిక ఎన్నికల్లో మహిళదే పైచేయి



ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

- కీలకం కానున్న మహిళా ఓటర్ల నిర్ణయం
- చీరాల నియోజకవర్గంలో 82.61 పోలింగ్ శాతం

చీరాల అర్బన్: సార్వత్రిక పోరులో చీరాల నియోజకవర్గంలోని ఓటర్లలో ఎక్కువ మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 202711 మంది ఉన్నారు. వీటిలో పురుషులు 98,729 మంది, స్త్రీలు 103958 మంది, థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న 202711 మంది ఓటర్లలో 167466 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని నియోజకవర్గ ఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 82.61 శాతంగా నమోదైంది. 2019 ఎన్నికలలో 84.01 శాతంగా నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల, వేటపాలెం మండలాల్లో ఏర్పాటు చేసిన 218 పోలింగ్ కేంద్రాల్లో 167466 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుష ఓటర్లలో 98729 మందికి గాను 81772 మంది ఓట్లు వేశారు. అలానే మహిళా ఓటర్లు 103958 మందిగా 85681 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

82.61 పోలింగ్ శాతం..

చీరాల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలలో 82.61 పోలింగ్ శాతం నమోదు కాగా పురుషుల కంటే స్త్రీలు 3909 మంది అధికంగా ఓట్లు హక్కును వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా మహిళల హవానే అధాకంగా కన్పించింది. సాధారణ, సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల్లో కూడా మహిళల ఓట్లే అభ్యర్థుల గెలుపుకు కీలకం కానున్నాయి. పురుషులతో పాటు అన్నీ రంగాల్లో సమాన హక్కులు సాధించిన మహిళలు ప్రజాప్రతినిధుల ఎన్నికల విషయంలో మూలస్తంభంగా ఉన్నారు. మహిళలే నియోజకవర్గంలో ఓటర్లలో ఆధిపత్యం వహించారు. ఎన్నికల్లో మహిళల ఓట్లు సాధించిన వారికి గెలుపు సులభమేనని రాజకీయ విశ్లేషకులు వాఖ్యానిస్తున్నారు. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో జనాభా పరంగా, ఓట్ల పరంగా మహిళలే అధికంగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలలో మహిళా ఓటర్లే తీర్పుచెప్పే వారు కావడం విశేషం.

క్రీడలతో స్నేహభావం పెంపు



మొదటి బహుమతి సాధించిన జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న ప్రకాష్

చినగంజాం: యువకులు క్రీడలను ఆడటం ద్వారా వారి మధ్య స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాదర్తి ప్రకాష్ అన్నారు. చినగంజాం అంబేడ్కర్ నగర్‌లోని ఆర్‌సీఎం స్కూల్‌లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం వన్డే మినీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో పలు క్రీడా జట్టులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల అనంతరం మొదటి బహుమతిని అంబేడ్కర్ యూత్ సాధించగా రూ 3016, రెండో బహుమతి దేవదానం ఫ్రెండ్స్ సాధించగా రూ 2016, మూడో బహుమతి పెదబాబు ఫ్రెండ్స్ సాధించగా రూ 1016లను మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాదర్తి ప్రకాష్ బహుమతులను సమకూర్చి మూడు జట్లకు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొల్లా రామకోటయ్య, మేడికొండ డేవిడ్, బడుగు సుధాకర్, బొలిమెర మోషే, పాదర్తి దేవదానం, ప్రభాకర్, లింకన్, రాంబాబు పాల్గొన్నారు.

16 వరకు కొనసాగనున్న అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాలధారణ స్వాములు

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ బాలకోటేశ్వర స్వామి ఆలయంలో గడచిన 40 రోజులుగా వీరబ్రహ్మేంద్రస్వామి మాలధారణ స్వాములు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 9 నుంచి మొదలుకొని మే16వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 120 మంది మాలధారణ స్వాములు అన్నదాన కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహించారు. వీరంతా ఇరుమడులు కట్టుకొని కడప జిల్లాలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి వెళ్లి తమ ఇరుముడులు చెల్లించి మొక్కు తీర్చుకోనున్నారు.

రేపు ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం

చీరాల టౌన్: పట్టణంలోని శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్‌లో గురువారం ఉచితంగా ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు) సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు, తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నామని హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ మంగళవారం తెలిపారు. చీరాల నియోజకవర్గంలో వివిధ రకాల ఈఎన్‌టీ, ఆనారోగ్య సమస్యలతో భాదపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరాజ్ సూచించారు. వివరాలకు 78978 90737 నంబరును సంప్రదించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వైద్యం



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం వైద్య వసతి లేని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 104 ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తున్న గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ రవితేజ అన్నారు. మంగళవారం నక్కబొక్కలపాడు గ్రామంలో 104 వాహనం ద్వారా వృద్ధులు, బాలింతలు, గర్భిణులకు వివిధ రకాల పరీక్షలతో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరానికి రాలేని వృద్ధులను, చిన్నారులను సాయంత్రం సమాయంలో ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యానికి గురైన వారు పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బు ఖర్చు చేయవద్దని చెప్పారు. అన్ని రకాల సేవలు వైద్యశాలలో ఉన్నాయని చెప్పారు. ఈశిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, ఆశ్లేష నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భద్రత నడుమ ఈవీఎంల తరలింపు

చీరాల టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఈవీఎంలు, ఇతర సామగ్రిని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాలకు ప్రత్యేక వాహనాలలో తరలించారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు వినియోగించి భద్రపరిచిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను మంగళవారం తెల్లవారుజామున ఏఆర్ పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాల భద్రత నడుమ వాహనాల్లో తరలించారు. ఎన్నికలో పోలింగ్ పూర్తి అయిన అనంతరం ఈవీఎంలను, వీవీ ప్యాట్ బాక్సులను నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి స్వీయ పర్యవేక్షణలో సహాయ ఎన్నికల అధికారులు, తహశీల్దార్‌లు నాసరయ్య, పి.కృష్ణకాంత్, మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తిలు రాజకీయపార్టీల నాయకుల సమక్షంలో భద్రంగా ఉంచిన ఈవీఎంలను ప్రత్యేకంగా తయారు చేసిన బాక్సుల్లో నిలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో రిసిప్షన్ కేంద్రంలో ఉంచిన ఈవీఎంలను జిల్లా కేంద్రాలకు తరలించాలని ఆదేశించడంతో చీరాల్లోని అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల ఎన్నికకు వినియోగించిన ఈవీఎంలను బాపట్లకు తరలించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలను తరలించారు. జూన్ 4 తేదీన ఓట్ల లెక్కింపు జరిగే వరకు స్ట్రాంగ్‌రూంలలో ఈవీఎంలను భద్రపరచనున్నట్లు ఎన్నికల అధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

దళితులపై టీడీపీ నాయకుల దాడి హేయం



గాయపడిన శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబురావు

చినగంజాం: రంగప్పనాయుడుపాలెంలో దళితుడు నరేంద్ర శ్రీనివాస్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బాపట్ల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, చినగంజాం మండల వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు అన్నారు. మంగళవారం ఆయన చీరాల ప్రభుత్వ వైద్యశాలలో కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతున్న నరేంద్ర శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో టీడీపీకి ఓటు వేయలేదని అదే గ్రామానికి చెందిన మాలెంపాటి సాయికృష్ణ అనే వ్యక్తి చీరాల దండుబాట రోడ్డులో కాపు కాసి చీరాల వైపు నుంచి గ్రామానికి తిరిగి వస్తున్న నరేంద్ర శ్రీనివాస్ ద్విచక్రవాహనాన్ని ఆపి అతనిని కింద పడవేసి కత్తితో పొడవటం దారుణం అని ఆయన అన్నారు. రంగప్పనాయుడు పాలెంలో దళితులపై అగ్రవర్ణాలు చేస్తున్న దాడులను దళితులంతా ఏక కంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. వారు చేస్తున్న అరాచకాలను తట్టుకోలేక దళితులు భయంతో జీవనం చేస్తున్నారని, వాళ్లకు రక్షణ కల్పించాలని ఆయన అధికారులను కోరారు. నరేంద్ర శ్రీనివాస్‌పై దాడి జరిపిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాల్సిందిగా జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్‌లను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. అదే విధంగా గాయాలపాలైన వ్యక్తికి సరైన వైద్య సహాయం అందించాలని కోరారు.